ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 01.06.2025 సమయం 18.10 గంటలు

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రేపు సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్స్ లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పతాకావిష్కరణ చేస్తారు.
2. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది.
3. గిరిజనుల అభ్యున్నతికి రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వెయ్యి కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లుగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.
4. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాగల 3 రోజుల్లో పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

...............................................

**రాష్ట్ర అవతరణ దినోత్సవం**

సికింద్రాబాద్ పేరేడ్స్ మైదానంలో రేపు జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రధాన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ వేడుకల సందర్బంగా ప్రభుత్వం పలు కొత్త పథకాలు ప్రకటించే అవకాశం ఉంది..

డెస్క్

**సేవా పతకాలు :**

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. దీనికి సంబంధించి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుశాఖలో పనిచేసే గ్రేహౌండ్స్‌కు చెందిన 9 మందికి శౌర్య పతకం దక్కింది. 16 మంది మహోన్నత సేవా పతకం, 92 మంది ఉత్తమ సేవా పతకం, 47 మంది కఠిన సేవా పతకం, 461 మంది సేవా పతకం అందుకోనున్నారు.

డెస్క్

**ఫోన్ ట్యాపింగ్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న విశ్రాంత ఐపీఎస్ అధికారి టి.ప్రభాకర్‌రావు ఈ నెల 5న సిట్ విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఆయన 14 నెలలుగా అమెరికాలోనే ఉన్నారు. భారత్‌కు తిరిగి రావాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలిచ్చింది. విచారణకు సహకరిస్తానంటూ సుప్రీంకోర్టుకు అండర్ టేకింగ్ లేఖను ప్రభాకర్ రావు ఇచ్చారు. వన్ టైం ఎంట్రీ పాస్‌పోర్టు అందిన వెంటనే భారత్‌కు ఆయన వచ్చే అవకాశం ఉంది.

డెస్క్

**జిల్లాలో ఫిట్ ఇండియా సండే ఆన్ సైకిల్**

ఎల్లుండి ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ లలో ఫిట్ ఇండియా సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ లోని క్రీడా పాఠశాల మైదానం నుంచి ఏర్పాటుచేసిన సైకిల్ ర్యాలీని ఆర్ఎస్ఐ రాజేష్ జెండా ఊపి ప్రారంభించగా, కాగజ్ నగర్ లో డిఎస్పి కరుణాకర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకిల్ ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలగడంతోపాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు..

ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

**అంగన్వాడీల పదవి విరమణ పెంపు హర్షనీయం**

అంగన్వాడీల పదవీ విరమణ 65 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు స్వప్న హర్షం వ్యక్తం చేస్తారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ ..........

స్వప్న బైట్ .................

పిటిసి

**గిరిజనుల సంక్షేమం :**

గిరిజనుల అభ్యున్నతికి వారి ఆత్మ గౌరవ పరిరక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా  కిన్నెరసాని లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆదివాసి  కార్యకర్తల సమ్మేళనం, శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా గిరిజనులకు వెయ్యి కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లుగా ఆయన వెల్లడించారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను క్రమం తప్పకుండా గిరిజనుల కోసమే ఖర్చు చేస్తున్నామని, ఇప్పటికే ఇందుకు 17 వేల 169 కోట్ల రూపాయలు కేటాయించామని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

డెస్క్

**పండ్ల తోటలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పామాయిల్ సాగుతో పాటు, సంప్రదాయేతర పంటల సాగుపై జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అరటి, జామ, బొప్పాయి వంటి పండ్ల తోటల పెంపకం, వివిధ రకాల కూరగాయల పంటల సాగులో రైతులను ప్రోత్సహిస్తున్నారు. రైతులకు అందిస్తున్న శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, సంప్రదాయేతర పంటల సాగు పద్ధతులపై మరిన్ని వివరాలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్.. ఆకాశవాణి ప్రతినిధికి వివరించారు.

ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బైట్ ...........

పిటిసి

**స్లాట్ బుకింగ్**

రేపటి నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ కు స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులో వస్తాయని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఈ సేవలు 47 చోట్ల  అమలవుతుండగా మిగిలిన 97 చోట్ల ప్రారంభిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ విధానం సత్ఫలితాలను అందిస్తుందని, రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

డెస్క్

**కవిత – లేఖ**

జిహెచ్ ఎం సి లో వర్షాకాల అత్యవసర బృందాల టెండర్లు రద్దు చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆమె లేఖ రాశారు. ‘జీహెచ్ఎంసీలో వర్షాకాలం పనుల టెండర్లలో అక్రమాలు జరిగాయని, కొందరు అధికారులు తమ అనుకూల సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఒకటి, రెండు ఏజెన్సీలకు లబ్ధి కలిగేలా నిబంధనలు మార్చారని, దీనివల్ల జీహెచ్ఎంసీపై ఏటా 5 కోట్ల 85 లక్షల రూపాయల వరకు అదనపు భారం పడుతుందని, లేఖలో కవిత పేర్కొన్నారు.

డెస్క్

**విత్తనాల పంపిణీ**

రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా రేపటి నుంచి ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేసిన విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు 5 పంటలకు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా 11వేల గ్రామాల్లో 40వేల మందికి విత్తనాలు పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

డెస్క్

**సింగరేణి**

2025-26 బొగ్గు ఉత్పత్తి సంవత్సరం మొదటి నెల అయిన ఏప్రిల్‌లో 95శాతం, మే నెలలో 104శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి సాధించింది. సింగరేణిలోని ఐదు ఏరియాలు నూరుశాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నాయి. రామగుండం2, రామగుండం3, శ్రీరాంపూర్, మణుగూరు, కొత్తగూడెం ఏరియాలు బొగ్గు నెలవారీ లక్ష్యాలను సాధించాయి. మేలో 134శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి రామగుండం2 ఏరియా సింగరేణిలోనే ప్రథమస్థానంలో నిలవగా.. 120శాతం లక్ష్యాన్ని సాధించిన మణుగూరు ఏరియా ద్వితీయస్థానంలో నిలుస్తోంది.

డెస్క్

**వాతావరణం**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాగల 3 రోజుల్లో పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదరుగాలులు వీస్తాయని పేర్కొంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు బలంగా ఉండడంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

డెస్క్

**వర్షాకాలం**

హైదరాబాద్ మహానగరంలో వర్షాకాలంలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇందుకోసం రెయిన్ టీం లను సిద్ధం చేశామని, వాన నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా, డ్రైనేజీ వ్యవస్థను మరింతగా మెరుగుపరిచామన్నారు. అలాగే  నగరంలో ఎక్కడా ట్రాఫిక్ జాం కాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

డెస్క్